క్లుప్తంగా

'ప్రజావాణి'కి అధికారులు గైర్హాజరు



ఆత్మకూర్: మండలంలోని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న ప్రజావాణికి అధికారులు గైర్హాజరవుతున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తహసీల్దార్ మినహా అన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కాగా డ్రెయినేజీ నిర్మాణం ఆపాలంటూ ఒక ఫిర్యాదు అందిందని, అధికారుల గైర్హాజరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ సింధూజ అన్నారు.

నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన



వనపర్తి: డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్‌కుమార్ పారిశుద్ధ్య కార్మికుల పట్ల చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సోమవారం కార్మికులు జిల్లా జనరల్ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శానిటేషన్ పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు ఉదయం 6 గంటలకే నిరసన వ్యక్తం చేసి అనంతరం నల్ల బ్యాడ్జీలతోనే విధులకు హాజరయ్యారు. అధికారులు స్పందించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



పెబ్బేరు: హైదరాబాద్ గాంధీభవనంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేరు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అల్వాల సాయిగౌడ్ ఎన్నిక అయినట్లు కార్యకర్తలు తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సాయిగౌడ్ ఎన్నిక వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిగౌడ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాండుసాగర్, మండల యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఆవుల రమేష్, రాము, పరమేష్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల అరెస్టు అప్రజాస్వామికం



మదనాపురం: వీఓఏలు చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో శాంతియుతంగా తరలివెళ్తున్న వీఓఏలను పోలీసులు అరెస్టు చేయడం సరియైంది కాదని సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ పేర్కొన్నారు. వీఓఏలు 43 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయడంపై మండిపడ్డారు. వెంటనే వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వారికి నెలకు రూ.26 వేల వేతనం, ఐడీ కార్డులను ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి సీనియార్టీ కలిగిన వారికి సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ముందరితండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ రమేష్‌నాయక్ తండ్రి పరశురాంనాయక్ కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. పరశురాంనాయక్ కుటుంబ పరిస్థితిని టీఎమ్మార్ యువజన సంఘం సభ్యులు ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మేఘారెడ్డి తక్షణ సహాయం కింద రూ.10వేలు పంపించాడు. ఆ నగదును సోమవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న రమేష్‌నాయక్ తండ్రికి అందజేశారు.

31న వాహనాల వేలం

కొల్లాపూర్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఈ నెల 31న వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ ఏడుకొండలు వెల్లడించారు. అక్రమంగా సారా, బెల్లం తరలిస్తుండగా పట్టుకున్న 3 మోటార్ సైకిళ్లు, ఒక ఆటో, ఒక మారుతి వ్యాన్‌కు వేలం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు వేలం సమయంలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

ముందుకు సాగని పనులు

- 4 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరు
- ఐదేళ్లు గడుస్తున్నా పనులు చేపట్టని కాంట్రాక్టర్
- కచ్చ రహదారితో రైతుల ఇక్కట్లు



అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్లే కచ్చ రహదారి

అమరచింత: ఐదేళ్ల కిందట అమరచింత నుంచి మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారిని బీటీగా మార్చేందుకు నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగట్లేదు. 4 కిలోమీటర్ల మేర బీటీ వేయడానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులను చేపట్టకపోవడంతో ప్రజలు, రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమరచింత ఎత్తిపోతల పథకంతో పాటు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ద్వారా సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో ఇరుగ్రామాల రైతులు ఏడాదిలో రెండు పర్యాయాలు వరి పంటను పండిస్తున్నారు. వరిధాన్యాన్ని మార్కెట్‌కు తరలించే యత్నంలో కచ్చ రహదారిపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు పలుమార్లు ప్రమాదానికి గురయ్యాయి. జూరాల ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీటీ పనులు వెంటనే చేపట్టాలని పలుమార్లు పీజేపీ అధికారులకు విన్నవించినా.. ఇప్పటికీ పనుల్లో కదలిక లేకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. రోడ్డు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ విషయంలో అధికారులు మౌనంగా ఉండటంతోనే బీటీ రహదారి పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

మండల సమావేశంలో తీర్మాణం చేసినా..

అమరచింత, మూలమళ్ల గ్రామాలకు బీటీ పనులు వెంటనే చేపట్టాలని మండల పరిషత్ సాధారణ సమావేశంలో తీర్మాణాలు చేయటమే తప్పా.. ఇప్పటి వరకు పనులు చేపట్టలేని పరిస్థితుల్లో అధికారులు కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు దాపరించాయి. పనులు వెంటనే ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశించినా.. అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకు రావడంలేదు. పీజేపీ అధికారులు మాత్రం ఇప్పటి వరకు మూడు పర్యాయాలు కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించామని చెప్పుకొస్తున్నారే తప్ప పనుల్లో పురోగతి చూపలేక పోతున్నారు. వస్తున్నది వర్షకాలం కావడంతో మళ్లీ పనులు వాయిదా పడినట్లేనని ఇరు గ్రామాల రైతులు వాపోతున్నారు.

రహదారితో ఇబ్బందులు



అమరచింత ఎత్తిపోతల ఆయకట్టు ద్వారా పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా అందుతుండటంతో వరి పంటను సాగుచేస్తున్నాను. పొలానికి వెళ్లడానికి కచ్చ రహదారే శరణ్యం. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంటుంది. అధికారులు స్పందించి బీటీ పనులు త్వరితంగా పూర్తి చేయాలి.

– కృష్ణారెడ్డి, రైతు, అమరచింత

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

బీటీ రహదారి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు పలుమార్లు నోటీసులు అందించాం. సుమారు ఐదేళ్ల కాలం దాటుతున్న పనులు చేయకపోవడం ఏమిటని, ఇలా పనులు చేపట్టకపోతే బ్లాక్ లిస్ట్‌లో ఉంచుతామని హెచ్చరించాం. కాంట్రాక్టర్‌తో మరోమారు చర్చించి త్వరితంగా పనులు పూర్తి చేసి ఇరు గ్రామాల ప్రజలు, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, జేఈ, పీజేపీ నందిమళ్ల డివిజన్

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి చొరువ చూపాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మల్లాయిపల్లికి చెందిన బీటెక్ విద్యార్థి కార్తీక్‌కు ఎమ్మెల్యే ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి పోటి ప్రపంచంలో ఉద్యోగం సంపాదించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. పేద విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా శ్రద్ధతో చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ల్యాప్‌టాప్ అందజేసిన ఎమ్మెల్యేకు విద్యార్థి, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు దశరథనాయుడు, వెంకటయ్య, శివరాములుగుప్తా, బుచ్చన్న, నర్సింహ, సత్యం, సత్యరాజ్, మద్దిలేటి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ఎజెండా



మాట్లాడుతున్న రైతు సమితి కోఆర్డినేటర్

ఖిల్లాఘనపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని ఎంపీపీ కృష్ణానాయక్, రైతు సమితి కోఆర్డినేటర్లు తిరుపతయ్యయాదవ్, వెంకటేశ్వర్‌రావు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. సోమవారం మండలంలోని మామిడిమాడ క్లస్టర్ పరిధిలో రైతువేదికలో రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా తదితర ప్రత్యేక పథకాలను తీసుకొచ్చారని కొనియాడారు. గతంలో సాగునీరు లేక బతుకు దెరువు కోసం పట్టణాలకు వలస వెళితే నేడు ఉన్న గ్రామంలోనే పంటలు పండించుకుంటూ కుటుంబంతో కలిసి సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది రాష్ట్రానికి వలస వచ్చే పరిస్థితి నెలకొందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోహన్‌జీ, నిర్మల సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి పురేందర్‌రెడ్డి, విక్రం, మల్లారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గోపాల్‌నాయక్, వెంకట్‌రాములు, ప్రతాప్‌రెడ్డి, గోపాల్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను 'బీసీ ఏ' లోకి చేర్చాలి



నినాదాలు చేస్తున్న ముదిరాజ్‌లు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ముదిరాజులను బీసీ ఏ లోకి చేర్చాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మామిడిమాడ, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి గ్రామాల్లో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం చైతన్య సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ముదిరాజులను ఏకం చేసే కార్యక్రమంలో భాగంగా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని మండల కేంద్రంలో త్వరలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ముదిరాజ్ ముద్దు బిడ్డ పండుగోళ్ల సాయన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎంతో కాలంగా ముదిరాజులను బీసీ ఏ లోకి చేర్చాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో చైతన్య సభలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు నాగన్న, కృష్ణయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

కేటీదొడ్డి: రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన రైతు హరిజన స్వామి పాముకాటుతో మృతి చెందాడు. దీంతో రైతు బీమా నుంచి రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం బాధిత గ్రామానికి వెళ్లి మృతిడి భార్య పద్మమ్మకు రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఉరుకుంద, పార్టీ నాయకులు చక్రధర్, శేఖర్‌రెడ్డి, రాజేష్, గోపి, గోవిందు, యుగంధర్, సాయివెంకట్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా పనులు ప్రారంభించండి

అమరచింత: పట్టణంలో నూతన ఈద్గా పనులను వెంటనే ప్రారంభించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. ఈద్గా ప్రాంతాన్ని సోమవారం సందర్శించి శిథిలావస్థకు చేరువలో ఉన్న ఈద్గాను తొలగించాలన్నారు. వీటి కోసం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని, రంజాన్ మాసంలో పనులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించినా ఇప్పటి వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈద్గా నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిప్పు, ఫయాజ్, ఖదీర్ పాల్గొన్నారు.

ప్రజల ఇళ్లు కూల్చినప్పుడు ఎక్కడున్నారు?

వనపర్తి టౌన్: రోడ్ల విస్తరణలో భాగంగా ప్రజల ఇళ్లను కూల్చినప్పుడు మాజీ మంత్రి చిన్నారెడ్డి ఎక్కడున్నాడని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం, జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం రోడ్ల విస్తరణకు అనుగుణంగా జరిపితే ఏం కాదు కానీ, రాజీవ్‌గాంధీ విగ్రహం జరిపితే కాల్చివేస్తారా అని మండిపడ్డారు. ప్రజలు సమస్యలు ఉన్నాయని విన్నవిస్తే నవ్వి ఊరుకోవడం సరికాదన్నారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున బీసీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా గొర్రెల పంపిణీ



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, పశువర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, వెటర్నరీ వైద్యుడు రమేష్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార భవనంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, డైరెక్టర్ రాజేష్, జేఈఓ నిర్మల, సంఘాల అధ్యక్షులు కురుమూర్తి, చంద్రయ్య, రాజు, గోపాల్‌యాదవ్, రఘు, రమేష్, గొర్రెల పెంపకందారులు ఉన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చుకుందాం



పాత వస్తువుల సేకరణ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్

అమరచింత: పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందామని, దీనికోసం ప్రజలు సహకరించాలని మెప్మా కోఆర్డినేటర్ యువరాజు అన్నారు. పట్టణంలోని పదో వార్డులో సోమవారం ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించి కాలనీవాసుల ద్వార పాత వస్తువులు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీయే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అన్ని వార్డుల్లో ప్రతి ఇంట్లో ఉన్న పాత వస్తువులు, కాగితాలు, నోటు పుస్తకాలు, పాత బట్టలు, చెప్పులు, ప్లాస్టిక్ పాడైన వస్తువులను సేకరించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత వ్యవహారంలో ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించడంలో ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారని తెలిపారు

విగ్రహాలకు రక్షణ కల్పించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వీపనగండ్ల: సమాజ హితం కోసం అసువులు బాసిన మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కతలప్పకు వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రకారమే చిన్న రాష్ట్రాలు ఏర్పడ్డాయని జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవిర్భావ ఉత్సవాల్లో అంబేడ్కర్ కీర్తిని ఘనంగా చాటాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి మురళి అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక రక్షణ కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శరత్, మీసాల సహదేవుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను పట్టించుకోరా?

అడ్డాకుల: కులవృత్తి లేని వాల్మీకి బోయలను పాలకులు పట్టించుకోవడం లేదని మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ విమర్శించారు. మూసాపేట మండలం వేములలో సోమవారం ఇంటింటికీ వాల్మీకి మహర్షి కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. కుల వృత్తుల వారికి రూ.లక్షలు ప్రకటిస్తున్న ప్రభుత్వం తమ గురించి ఆలోచించడం లేదని వాపోయారు. తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న పాలకులు ఎస్టీ జాబితాలో చేర్చడంపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కేవలం మోసపూరిత హామీలు ఇచ్చి తమను మభ్యపెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు వాల్మీకులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, చెన్నకేశవులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి

అడ్డాకుల: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు 2023 వానాకాలం రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ క్లస్టర్ విస్తరణ అధికారులకు పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ ప్రతులతో పాటు మొబైల్ ఫోన్ నంబర్‌ను ఇవ్వాలని సూచించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని వర్నె గ్రామానికి చెందిన మహేందర్ కొన్నాళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయి ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. ఈ మేరకు బాధితుడిని సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెద్దమునుగల్‌చేడ్ సర్పంచ్ విజయలక్ష్మి, కోఆప్షన్ ఖాజాషెరీఫ్, చంద్రమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం



పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లికి చెందిన మేర్వారెడ్డికి మంజూరైన రూ.16వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ సహాయంతో పేద కుటుంబాలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం కలుగుతుందన్నారు. చెక్కు మంజూరు చేయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, చెక్కు మంజూరుకు కృషి చేసిన మండల ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, రవీందర్‌గౌడు, సత్యారెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహ, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు భక్తులు శివలింగాన్ని అలంకరించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పెద్దమందడిలో ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలపడంతో పాటు ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ ప్రకారం రూ.19,500 వేతనం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రతినెల మొదటి వారంలోనే వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్న, నాగన్న, వెంకటయ్య, బాలకృష్ణ, వెంకటన్న, శ్రీనివాసులు, కార్మికులు ఉన్నారు.

పాన్‌గల్: పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్, ప్రమాదబీమా కల్పించాలని కోరుతూ సోమవారం ఆల్‌ఇండియా ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రమాద బీమా రూ.10 లక్షలు, కార్మికులు చనిపోతే దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలని, వయస్సు పేరుతో కార్మికులను తొలగించకుండా వారి కుటుంబంలో ఒకరికి అవకాశం కల్పించాలని కోరారు. సంవత్సరానికి మూడు జతల దుస్తులు, చెప్పులు, సబ్బులు, నూనెలకు నగదు రూపంలో అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బయ్య, పెంటయ్య, బాలయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

మదనాపురం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మదనాపురం ఎంపీడీఓ కార్యాయలంలో జీపీ కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని వాపోయారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా కోశాధికారి రాజు, అంజి, దస్తగిరి, ఆంజనేయులు, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సోమవారం పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు ఎంపీడీఓ అఫ్జల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు గట్టమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్స్, బిల్ కలెక్టర్లు, స్వీపర్స్, ఎలక్ట్రీషన్స్, వాటర్‌మెన్లు, డ్రైవర్స్ వంటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, చిన్నరాములు, ఇబ్రహీం, ఎండీ.రుక్మద్దీన్, అలివేల, కృష్ణ, మొగులయ్య, నాగమ్మ, జానమ్మ, లలిత, రాధ, లక్ష్మీదేవమ్మ, వెంకటమ్మ, బాలకృష్ణ, రాములు, ఆంజనేయులు, శారద, రాజు, తిరుపతయ్య, బొజ్జమ్మ, కృష్ణయ్య, కొండన్న, యాదమ్మ తదితరులు ఉన్నారు.



పాన్‌గల్‌లో..



మదనాపురంలో..



ఆత్మకూర్‌లో..